క్లుప్తంగా

మాట నిలబెట్టుకున్నాం..

మణుగూరుటౌన్: దసరా పండుగ లోపు లాభాల వాటా, దసరా అడ్వాన్స్ చెల్లింపులకు కృషి చేసి ఇప్పిస్తామని టీబీజీకేఎస్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నదని బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బి.ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం మణుగూరు ఓసీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో నిలిచిన కార్మికులకు రావాల్సిన బకాయిలను టీబీజీకేఎస్ రాష్ట్ర నాయకత్వం, గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితలు ఎలక్షన్ కమిషనర్‌తో మాట్లాడి ఇప్పించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇంతియాజ్ పాషా, విద్య సాగర్, సుధాకర్, రవి, సాంబ, సుధాకర్, శ్రీహరి బాబుచ రవి, రవికిరణ్ తదితరులు ఉన్నారు.

దాడులు నిలిపివేయాలి

గుండాల: గాజాపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న సైనిక దాడులను తక్షణమే నిలిపివేయాలని ఎంపీపీ ముక్తి సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హమాస్ దాడిని అడ్డు పెట్టుకుని ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజలపైన సైనిక దాడులు సరైంది కాదన్నారు. సర్పంచ్ కొరం సీతారాములు, డివిజన్ నాయకులు యాసారపు వెంకన్న, ఈసం మంగన్న, ఈసం క్రిష్ణ, గడ్డం లాలయ్య, బానోత్ లాలు, దుగ్గి రియాజ్, భూక్యా వెంకన్న పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

ములకలపల్లి: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని నిరసిస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ములకలపల్లిలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. పార్టీ ములకలపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి కుంజా కృష్ణ మాట్లాడారు. డివిజన్ నాయకులు నవళ్ల ఆదినారాయణ, సరస్వతి, కృష్ణవేణి, కోటమ్మ పాల్గొన్నారు.

రజకులకు చట్టం తేవాలి

బూర్గంపాడు: రజకుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, అన్ని రాజకీయపార్టీలు ఈ అంశాన్ని తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు కోరారు. శుక్రవారం లక్ష్మీపురంలో రజకుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సామాజిక భద్రతకై రజకులకు రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. రజక ఫెడరేషన్‌కు ప్రతిఏటా రూ.500 కోట్లు బడ్జెట్‌లో నిధులు కేటాయించి పాలకవర్గాన్ని నియమించాలన్నారు. 50 ఏళ్లు నిండిన రజక వృత్తిదారులకు వృద్ధాప్య పింఛన్‌లివ్వాలన్నారు. సోలార్ పవర్‌తో దోబీఘాట్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి చిటికెన వెంకటేశ్వర్లు, కంచర్ల శ్రీనివాస్, శివకుమారి, లత, హుస్సేన్, బిక్షం, యు.నాగయ్య, వెంకటేష్, నగేష్, మంచినీళ్ల కృష్ణ పాల్గొన్నారు.

సామూహిక పూజలు

ములకలపల్లి: భక్త అభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. భారీగా మహిళలు హాజరుకాగా.. ఆలయ అర్చకులు ముకుందల సత్యనారాయణశాస్త్రి దంపతులు శాస్త్రోక్తంగా పూజా క్రతువు నిర్వహించారు. స్థానిక కమిటీ ఆధ్వర్యంలోఅన్నదానం నిర్వహించారు.

రూ.750 చెల్లించాలి

చర్ల: రోజు వారీ కూలీలకు సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా రూ.750 చెల్లించాలని ఎన్డీ భద్రాచలం సబ్ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని లింగాపురం, గొంపల్లి, కొత్తపల్లి గ్రామాలలో వ్యవసాయ క్షేత్రాల్లో వ్యవసాయ కూలీలతో మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు చాలీచాలని కూలీ రూ.300 చెల్లిస్తూ రైతులు వారి శ్రమను దోచుకుంటున్నారని, వాటితో కనీసం నిత్యావసరాలు కూడా రావడం లేదని అన్నారు. నాయకులు సిరిగిడి నరేష్, పాండు, సమ్మక్క, భద్రమ్మ పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం

మణుగూరుటౌన్: అర్హత కలిగిన వారికి అసలైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలైన దళిత బంధు, బీసీ లోన్లు ఇవ్వకుండా బీఆర్ఎస్ కార్యకర్తలకు, పార్టీలకు, పార్టీ ఫిరాయింపులు చేసిన వారికే కేటాయించారని సీపీఐ కార్యకర్తలు శుక్రవారం ఆరోపించారు. సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీపీఐ కార్యకర్తలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. 119 నియోజకవర్గాల్లో సీపీఐ క్యాడర్ బలంగా ఉన్న పినపాకలో సీపీఐకి కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడారు. సరెడ్డి పుల్లారెడ్డి, జంగం మోహన్‌రావు, సొందె కుటుంబరావు, సుధాకర్, అక్కి నర్సింహారావు, సర్వర్, తోట రమేశ్, వీరస్వామి, క్కుల రాజబాబు, ఎస్కే నాయుడు, చింతల దశరథం పాల్గొన్నారు.

వైద్య శిబిరం

చర్లరూరల్: చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని విజయకాలనీ ఏరియాలో శుక్రవారం హోమియోపతి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హోమియో డాక్టర్ పూజ 56 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.అ నంతరం వారికి అవసరమయ్యే అందజేశారు.అలాగే చర్ల పీహెచ్‌సీలో అన్ని వ్యాధులకు హోమియోపతి మందులు అందుబాటులో ఉన్నాయని, అన్ని వ్యాధులకు వైద్యం అందించబడుతుందని తెలిపారు. శిబిరంలో డీపీయంఓ ఎ.ముత్యాలరావు, హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, యంసీహెచ్ స్టాఫ్‌నర్స్ రమాదేవి, యంఎల్‌హెచ్‌పీ రమ్య, ఆశా కార్యకర్త ఉషారాణి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లో అగ్నిమాపక కేంద్రం

- ఫైరింజన్‌లో నీటి కోసం 5 కిలోమీటర్లు వెళ్లాల్సిందే..
- దశాబ్దం దాటినా ఔట్ పోస్ట్‌గానే సేవలు
- కేంద్రం చుట్టూ చేరుతున్న వర్షపు నీరు
- మౌలిక నదుపాయాలు లేక ఇక్కట్లు


మణుగూరులోని అగ్నిమాపక కేంద్రం..

మణుగూరుటౌన్: మణుగూరు అగ్నిమాపక కేంద్రం సమస్యల నడుమ సతమతమవుతోంది. 15 సంవత్సరాలుగా ఫైరింజన్‌కు నీళ్ల లేకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తోంది. ఏళ్ల తరబడిగా తిష్టవేసిన సమస్యలు నేటికీ అలాగే దర్శనమిస్తున్నాయి. 2008లో పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మంజూరైన అగ్నిమాపక కేంద్రం రెండు నెలల క్రితం దాకా అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాలకు ఒక్కటే దిక్కు గా ఉంది. నియోజకవర్గంలోని మూడు ప్రధాన మండలాలకు ఒక్కటే ఉన్నా ప్రధాన మౌలిక సదుపాయమైన నీటి వసతి లేకపోవడంతో ఏదైనా ప్రమాదం జరిగితే సిబ్బంది ఫైరింజన్‌లో నీటిని నింపేందుకు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. రెండు గదుల భవనం మాత్రమే గతంలో నిర్మించగా, వాహనానికి రేకుల షెడ్డు సిబ్బంది ఏర్పాటు చేసుకోవడం విశేషం.

మణుగూరులోని అగ్ని మాపక కేంద్రం అవుట్ పోస్ట్ కావడంతో ప్రత్యేక నిధులు మంజూరు కాకపోవడం ప్రధాన సమస్యగా మారింది. రెగ్యులర్ స్టేషన్ చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నా అది తీరని కోరికగా మిగిలిపోయింది. సమితిసింగారం పంచాయతీలోని వివేకానంద కాలనీలో ఉన్న అగ్ని మాపక కేంద్రం ఫైరింజన్ ఐదు కిలోమీటర్ల దూరంలోని జీఎం ఆఫీస్ వద్ద నీటిని నింపుకోవాలి. అక్కడ నీటి కొరత సమస్య ఏర్పడితే మరో 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్వారీల్లోకి వెళ్లక తప్పదు. ఏదైనా అనుకోని పెద్ద అగ్ని ప్రమాదం సంభవిస్తే 4,500 లీటర్ల కెపాసిటీ కలిగిన ఫైరింజన్‌ను రెండు మూడుసార్లు నీటి కోసం ఆ ప్రదేశాలకు తీసుకెళ్లాలి తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. ఇటీవల పినపాక మండలానికి అగ్నిమాపక కేంద్రం మంజూరు కాగా, ఒక మండలం మణుగూరు అగ్నిమాపక కేంద్రం పరిధి నుంచి తొలిగించగా, ప్రధాన సమస్య అయిన నీటి సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు అనంతరం రోడ్డు వేయడంతో కేంద్రం లోతు ప్రదేశం ఏర్పడగా, వానాకాలం వచ్చిందంటే చుట్టూ వరద చేరి చిన్నపాటి చెరువును తలిపిస్తోంది. వానలు తగ్గి వారాలు గడిచినా డ్రెయినేజీలో, కేంద్రంలో నిలిచిన నీరు పోయే దారిలేక, బ్లీచింగ్ లేక జ్వరాలతో విధులకు హాజరవ్వడం అక్కడి సిబ్బందికి నిత్యకృత్యంగా మారింది. ఇప్పటికైనా రెగ్యులర్ అగ్నిమాపక కేంద్రం పరిధిలోకి తీసుకురావాలని అన్ని వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. గతంలో ఉన్నటువంటి అవకాశాన్ని బట్టి అవుట్ పోస్ట్‌గా ఉంచారు. అనంతరం ఫైర్ స్టేషన్ విభాగం చేతుల్లోకి తీసుకుంది. ప్రధాన రహదారిపై ఫంక్షన్ హాల్ ఉండటం, మరోవైపు రోడ్డుపై కరెంట్ పోల్ ఉండటం వల్ల ప్రమాదం జరిగిన వెంటనే ఒక్కోసారి వెళ్లడానికి ఇబ్బంది ఏర్పడుతోంది. ఏది ఏమైనా ప్రమాద సంఘటన స్థలానికి వెళ్లి ప్రజలకు, వారి ఆస్తులకు ఇబ్బంది కలగకుండా చూస్తున్నాం.

– శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్

సైనికుల్లా ముందుకు సాగాలి


మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే మెచ్చా

ములకలపల్లి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుడిలా ముందుకు సాగాలని, అభివృద్ధి పథకాలే ఆయుధంగా ప్రజల్లోని దూసుకెళ్లాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సూచించారు. ములకలపల్లిలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలనే కాకుండా మేనిఫెస్టోలోని అంశాలను వివరించాలని తెలిపారు. అనంతరం గ్రామశాఖల వారీగా ఎంపీ సమీక్ష నిర్వహించగా ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సమష్టిగా పనిచేసి విజయ తీరాలకు చేరుదామని పిలుపునిచ్చారు. కాగా, సమావేశంలో పాల్గొన్న పలువురు నాయకులు పార్టీ పటిష్టంగా ఉన్నా, సమన్వయలోపమే ప్రధాన సమస్యగా మారిందని చెప్పినట్లు తెలిసింది. పార్టీ కార్యక్రమాల సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించినట్లు సమాచారం. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు మట్ల నాగమణి, పైడి వెంకటేశ్వరావు, భారత లావణ్య, మోరంపూడి అప్పారావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, శనగపాటి మోహరమణి, వెంకటేశ్వర్లు, రావు జోగేశ్వరరావు, చీకటి ప్రకాశ్ రావు, కారం సుధీర్, బైటి రాజేశ్, కీసరి శ్రీను, వాడే నాగరాజు. సున్నం సుధాకర్, గొల్ల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో వసతులు కల్పించాలి


ములకలపల్లి: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి రామం

అన్నపురెడ్డిపల్లి: పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల వసతులను కల్పించాలని నోడల్ అధికారి రామం అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి, అధికారులకు, సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీటి వసతి, మూత్రశాలలు, మరుగుదొడ్లు, గదులలో ఫ్యాన్లు, కరెంట్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపీడీఓ అన్నపూర్ణ, ఎంఈఓ షాబ్నా, ఎస్సై షాహీన తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బూర్గంపాడు: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజారావు, ఎంపీడీఓ వివేక్ రామ్,ఎస్సై రాజ్‌కుమార్‌లు శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, రెయిలింగ్, మరుగుదొడ్లు వంటి వసతులను పరిశీలించి స్థానిక అధికారులకు తగు సూచనలు చేశారు.ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన అన్ని పటిష్ట చర్యలు చేపట్టారు.

సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రతీ కార్యకర్తను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండల పరిధిలోని సాంబాయిగూడెం గ్రామంలో సుమారు 15కుటుంబాలు రేగా సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. వీరికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా సీఎం కేసీఆర్ మూడో సారి విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గంగారం వద్దగల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులంతా గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామ పంచాయతీలో పాయంమంగయ్య నుంచి పాములపల్లి వెళ్లే రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. బైక్‌పై వెళ్తున్న వ్యక్తి బైక్ అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతనిని 108లో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి పాములపల్లి గ్రామ సమీపంలోని వలస గిరిజన గ్రామానికి చెందిన వ్యక్తిగా సమాచారం.

నిబంధనలు పాటించాలి

అశ్వాపురం: ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని అశ్వాపురం సీఐ జి.రవీందర్ అన్నారు. మండలంలో సీఐ పర్యవేక్షణలో అశ్వాపురం, మొండికుంట ప్రాంతాల్లో ఎస్సైలు సురేష్‌కుమార్, తిరుపతిరావుల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శుక్రవారం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. వాహనాలను క్షుణ్ణంగా సోదాలు చేశారు. ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తామని అన్నారు.

ఎమ్మెల్యేతో సమావేశం

దుమ్ముగూడెం: భద్రాచలం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పొదెం వీరయ్యను గంగోలు సర్పంచ్ మడకం చంద్రశేఖర్, నర్సాపురం సర్పంచ్ వర్షా శివరామకృష్ణతో పాటు మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు బత్తుల శోభన్ బాబులు కలిసి భద్రాచలం ఏజెన్సీ అభివృద్ధి కొరకు మరో మారు రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలవాలని ఆకాంక్షిస్తూ శాలువా కప్పి అభినందనందించారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో చెలికాని ప్రసాద్ కుమార్తె సూర్యకళ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మృతురాలి భౌతిక కాయానికి పూలమాలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యంగా ఉండాలని చెప్పారు. నివాళులర్పించిన వారిలో ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి, దారా యుగంధర్, కొయ్యల అచ్యుతరావు, రెడ్డిమళ్ల చిట్టినాయన, రామకృష్ణ, హరికృష్ణ , బడే తదితరులు ఉన్నారు.

దుర్గాష్టమి వేడుకలు

ములకలపల్లి: మండలకేంద్రంలోని భక్త అభయాంజనేయస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో దుర్గాష్టమి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సీత దుర్గాసప్తశ్లోక పారాయణం, హనుమాన్ ఛాలీసా పారాయణం చేశారు. సత్యనారాయణరాజు,రాజయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



దుమ్ముగూడెం: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వీరయ్య

దుమ్ముగూడెం: మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన పర్ణశాల ఎంపీటీసీ తెల్లం భీమరాజుతో పాటు ముగ్గురు వార్డు సభ్యులు, మాజీ ఉప సర్పంచ్, డీసీసీ అధ్యక్షుడు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే దుమ్ముగూడెం యువజన సంఘం మండల అధ్యక్షుడు కోడి చంటి ఆధ్వర్యంలో మండలానికి చెందిన 30 కుటుంబాలు, 20 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లంక శివకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మండలంలోని కూనవరం పంచాయతీలో వివిధ పార్టీల నుంచి 150 కుటుంబాలకు పైగా మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం గడప గడపకూ ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవర్చేబోయే ఆరు గ్యారెంటీలతో పాటు ఇచ్చిన హామీలను వివరించారు. కాగా, మాజీ ఎంపీటీసీ ఏనిక కామరాజు, ఏనిక రామకృష్ణ ఆధ్వర్యంలో కూడా 75కుటుంబాలు, ఏనిక చిట్టయ్య గుంపు 80 కుటుంబాలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా కట్టడి


సారపాక వద్ద గోదావరిలోకి వెళ్లకుండా కందకాలు తవ్విస్తున్న అధికారులు

బూర్గంపాడు: ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ రాజారావు తెలిపారు. మండల పరిధిలోని సారపాక, తాళ్లగొమ్మూరు సమీపంలోని గోదావరి ఒడ్డున శుక్రవారం కందకాలు తవ్వించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజారావు మాట్లాడుతూ.. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఇసుక, మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. ఎవరైనా ఇసుక, మట్టి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా ఇసుక, మట్టి అక్రమ రవాణా జరుగుతుంటే పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖలలో ఎవరికైనా సమాచారమివ్వాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అందరు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

పెన్షనర్ల ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్లో శుక్రవారం పెన్షనర్ల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సమ్మేళనానికి చీఫ్ మేనేజర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్ పర్సన్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వృద్ధులకు పెన్షన్లు ఇచ్చే తేదీలలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని, 20వేల రూపాయల లోపు డిపాజిట్ చేయాలన్నా, తీయాలన్నా బయటకు పంపకుండా ఇక్కడనే ఇవ్వాలని కోరారు. అలాగే వృద్ధులు లేవలేని పరిస్థితుల్లో ఉన్నటువంటి వారికి బ్యాంకు సిబ్బంది స్వయంగా ఇంటికి వచ్చి పరిశీలించి వారి పెన్షన్లను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్పందించి మేనేజరు చారి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రధాన కార్యదర్శి కెఎస్ఎల్వి ప్రసాద్, కోశాధికారి కృష్ణమూర్తి, నాళం సత్యనారాయణ, జిల్లా బాధ్యులు ఎంవిఎస్ నారాయణ, పరిటాల సుబ్బారావు, ఎం. క్రిష్ణారావు, రామకృష్ణంరాజు, సుబ్బయ్య చౌదరి, అక్కయ్య, దుర్గాప్రసాద్, వి. రాంబాబు, వేట కాని సత్యనారాయణ, బంధు నరసింహారావు, దాసు, తోట కోటేశ్వరరావు, ఐలయ్య, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెలవులకు వెళ్తున్నారా.. జాగ్రత్త!

భద్రాచలంఅర్బన్: దసరా సెలవుల్లో ఊళ్లకు వెళ్లేవారు పలు జాగ్రత్తలు పాటించాలని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం రద్దీ పేపర్లు, ఖాళీ సంచులు, పూల మొక్కలు, చెడిపోయిన వస్తువులు కొనుగోలు చేసేవారిపై నిఘా పెట్టాలని తెలిపారు. రాత్రిళ్లు అనుమానంగా సంచరించే వారి పలుకరించి వారి వివరాలు సేకరించి ఏదైనా అనుమానం వస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని అన్నారు. శివారు ప్రాంత కాలనీల్లో తాళం వేసిన ఇళ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వెతికి, రాత్రిళ్లు చోరీలకు పాల్పడతారని వెల్లడించారు. విలువైన వస్తువులను పక్కింటి వారికి ఇచ్చి నమ్మి వెళ్లొద్దన్నారు. ఇరుగు పొరుగువారిని ఇంటిని కనిపెట్టుకోమని చెప్పాలని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా ప్రయాణం ముగించుకొని వచ్చేలా ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. ఇంట్లో వృద్ధులు, మహిళలు ఉన్నప్పుడు సమాచారం పేరుతో వస్తే నమ్మొద్దని తెలిపారు. కాలనీల వారీగా గస్తీ దళాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాళం వేసి ఊరికి వెళ్తే మీ సమీప పోలీసు ఠాణాలో సమాచారం ఇవ్వాలని వివరించారు. అనుమానితుల సమాచారం పోలీసులకు అందిస్తే చోరీల నివారణకు సహకరించినవారవుతారని పేర్కొన్నారు. సమాచారం ఇవ్వాలనుకునే వారు 100 లేదా సమీప పోలీసు స్టేషన్‌లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి


రాళ్లగూడెంలో మిర్చి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

చర్ల: మిర్చి పంటలకు ఆశించే తెగుళ్ల పట్ల రైతాంగం అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో అప్రమత్తమయ్యి సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం, పెరుగు మందుల పిచికారీ ద్వారా పంటలను రక్షించుకోవాలని వ్యవసాయశాఖాధికారులు సూచిస్తున్నారు. చర్ల మండలంలో రైతులు సాగు చేసిన మిర్చి పంటలకు ప్రస్తుతం వివిధ రకాల తెగుళ్లు ఆశిస్తున్న నేపథ్యంలో శుక్రవారం మండల వ్యవసాయశాఖాదికారి పి.శివరాంప్రసాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. మిర్చి పంటకు ఆశించే ప్రధానమైన చీడపీడల్లో వైరస్ తెగుళ్లు ముఖ్యమైనవని, వాటి నుంచి తప్పించుకునేందుకు మిర్చి పంట చుట్టూ రక్షణ పంటలైన జొన్న, మొక్క జొన్న లేదా సజ్జ పంటలను వేసుకోవాలి. నారుమడి యాజమాన్య పద్ధతిలో భాగంగా పిప్రోనిల్ గుళికలు 80 గ్రాములు సెంటు నారుమడికి వేసుకోవాలని తెలిపారు. వైరస్ లక్షణాలు కలిగిన మొక్కలను పీకి వేసి కాల్చి వేయాలని, కలుపు మొక్కలు పెరగకుండా చూసుకోవాలని సూచించారు. ఏయే తెగుళ్లకు ఏయే మందులు ఎంత వాడాలో వివరించారు.

గిట్టుబాటు ధర చెల్లించాలి

చర్ల: స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంట ఉత్పత్తులకు ప్రభుత్వమే గిట్టుబాటు ధరలు నిర్ణయించి కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు కెచ్చెల రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని డీవీకే భవన్‌లో పార్టీ సీనియర్ నాయకులు పాలెం చుక్కయ్య అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

చర్ల మండలంలో దాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు పత్తి కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి పంటకు కేంద్రం ప్రకటించిన ధర ఏ మాత్రం సరిపోదని, కనీసం రూ.18,500లు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా వరి పంటకు క్వింటాకు సాధారణ రకంకు రూ.4950లు, ఏ గ్రేడ్ రకం రూ 5,100 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని తహసీల్దార్ ఆర్.అనంత రామకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల రైతు సంఘం నాయకులు పాలెం చుక్కయ్య, సుజాత, శ్రీకళ, సందీప్, మైముదా, రవి, పార్టీ డివిజన్ నాయకులు దాసరి సాయి, తిరుపతమ్మ, వసుమతి, ఖాదర్‌బీ, అమీనా తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి అలంకరణలో అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా కొనసాగుతున్నాయి. ఆయా దేవాలయాలు, మండపాల్లో విశిష్ట పూజలు చేస్తున్నారు. రోజుకో రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు శుక్రవారం సరస్వతి రూపంలో అలంకరణ అందుకున్నారు. భక్తులు, ముఖ్యంగా చిన్నారులు దర్శించుకుని నైవేథాలు సమర్పించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేపట్టారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించడంతోపాటు పలు ప్రాంతాల్లో ఆలయ కమిటీలు ఏర్పాటు చేసిన అన్నదానాల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


దుమ్ముగూడెం: ములకపాడు ఆటోఅడ్డాలో సరస్వతి అలంకరణలో అమ్మవారు


అశ్వారావుపేటరూరల్: పూజలు చేస్తున్న మహిళలు, చిన్నారులు


చర్ల: త్రికూట మందిరంలో అన్నదాన కార్యక్రమం..